క్లుప్తంగా

500 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

పీఎం పాలెం: స్థానిక ఆఖరు బస్టాపు నుంచి బక్కన్నపాలెం రోడ్డులో గల శ్రీ శృంగేరీ శంకర మఠంలో సువర్ణ భారతీ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పీఎం పాలెం, బక్కన్నపాలెం, పరిసర కాలనీల్లో గల సుమారు 500 మంది వైద్య సేవలు పొందారు. నగరంలోని కళా హాస్పిటల్, మధురవాడ ఉజ్వల్ హాస్పిటల్, లయన్స్ క్లబ్ సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శృంగేరీ శంకర మఠం స్థానిక గౌరవ పాలనాధికారి జగర్లపూడి వెంకటేశ్వర్లు శిబిరం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

నిత్యావసర సరకుల పంపిణీ



నిత్యావసర సరకులు అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు చేపలు తిమ్మాపురంలో గల ఫిషర్ ఉమెన్ సొసైటీ సభ్యులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పాసి నర్సింగరావు, గరికిన కింగ్, దోణి నాగరాజు, శాకరి శ్రీనివాస్, పిల్లా బాలు, సూరాడ నర్సింగరావు పాల్గొన్నారు.

ఆశ్రమంలో ఆధ్యాత్మిక కార్యక్రమం



ఆశ్రమ పీఠాధిపతి ఆశీర్వాదం తీసుకుంటున్న విద్యార్థులు

దాబాగార్డెన్స్ : భీమిలి నియోజకవర్గంలో గల అప్పలాచార్య ఆశ్రమంలో ఆదివారం పాతనగరానికి చెందిన స్వామి వివేకానంద సంస్థ ట్యూషన్ విద్యార్థులు ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆశ్రమంలో సంకీర్తన నిర్వహించారు. పీఠాధిపతి రామన్న దంపతులు ఆశీర్వాదం పొందారు. పిల్లల్లో భక్తిభావన పెంపొందించేందుకు ప్రతి నెలా ఓ ఆశ్రమంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు.

కోడి పందాలు, పేకాట శిబిరాలపై దాడి

తగరపువలస : ఆనందపురం మండలం దుక్కవానిపాలెం శివారు ప్రాంతాల్లో కోడి పందాలు ఆడుతున్న వారిపై ఆనందపురం పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఏడుగురు వ్యక్తుల నుంచి రెండు కోడి పుంజులు, రూ.10,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సీఐ టీవీ తిరుపతిరావు, ఎస్ఐలు సంతోష్, శివ, రైటర్ గాంధీ, సిబ్బంది పాల్గొన్నారు.

- ఆనందపురం మండలం వేములవలస శివారులో పేకాట ఆడుతున్న వ్యక్తులపై పోలీసులు దాడి చేశారు. ఇక్కడ పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను అరెస్ట్ చేసి, రూ.10,030 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఎర్నిమాంబకు పూజలు

కంచరపాలెం: జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిలిచిపోయిన వంతెనల నిర్మాణం

- టి.నగరపాలెం, తాటితూరులో ముందుకు సాగని పనులు
- కాంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం



టి.నగరపాలెం వద్ద గోస్తనీ నదిపై మట్టి అడ్డుకట్ట వేయడంతోనే నిలిచిన నిర్మాణ పనులు

తగరపువలస : భీమిలి మండలం టి.నగరపాలెం, తాటితూరు పంచాయతీల్లో గోస్తనీ నదిపై వంతెనల నిర్మాణం సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా అకారణంగా నిలిచిపోయినట్టు తెలుస్తోంది. వైఎస్సార్‌సీపీ హయాంలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉండగా ఈ రెండు పంచాయతీల్లో వంతెనల నిర్మాణానికి భూమి పూజ చేశారు. టి.నగరపాలెంలో వంతెన నిర్మాణ పనులు ప్రారంభమై నదికి అడ్డంగా మట్టి కట్ట వేసినప్పటికీ అకాల వర్షాలు ప్రధానంగా అడ్డంకి సృష్టించాయి. తాటితూరు పంచాయతీలో నిర్మాణ పనులు ప్రారంభం కాకుండానే వంతెన నిర్మాణ పనులు అకారణంగా నిలిచిపోయాయి. ప్రస్తుతం ఈ రెండు చోట్ల నిర్మాణ వ్యయం పెరిగిందని కొత్తగా నిధులు వస్తేనే వంతెనలు నిర్మిస్తామని కాంట్రాక్టర్లు అన్నట్టు ప్రచారం జరుగుతోంది. టి.నగరపాలెం వద్ద వంతెన పూర్తయితే తగరపువలస ఎల్లారమ్మ మెట్టకు అనుసంధానంగా మార్గం ఏర్పడి చుట్టూ తిరిగి వచ్చే బాధ తప్పేది. అలాగే తాటితూరు వద్ద వంతెన నిర్మాణంతో నదికి అవతలి వైపు తాటితూరు కళ్లాలు, పద్మనాభం మండలంలోని పాండ్రంగి పంచాయతీకి చెందిన సామియ్యవలస కళ్లాలకు మార్గం సుగమం అయ్యేది. ప్రస్తుతం ఈ రెండు చోట్ల వంతెనలు లేని కారణంగా నదికి వరదలు వచ్చేటప్పుడు చుట్టూ తిరిగి రావడానికి స్థానికులు ఆటోలను ఆశ్రయించి జేబులు గుల్ల చేసుకుంటున్నారు.

రెండేళ్లలో రెండున్నర రెట్లు పెరిగిన వ్యయం

టి.నగరపాలెం వద్ద గోస్తనీ నదిపై వంతెన నిర్మాణానికి 2022లో రూ.2.98 కోట్ల అంచనా వ్యయంతో అప్పటి మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శిలాఫలకం వేశారు. చిప్పాడ దివీస్ లేబొరేటరీ సీఎస్ఆర్ నిధులతో నిర్మించ తలపెట్టిన ఈ పనులకు ఆ సంస్థ వెంటనే 15 శాతం నిధులు కూడా విడుదల చేసింది. దీంతో నదిలో నీటికి మట్టితో అడ్డుకట్ట వేసి పనులు ప్రారంభించేలోగా వర్షాలు ఆటంకం కలిగించాయి. ఇప్పుడు కాంట్రాక్టర్ ముందుకొచ్చి వంతెన నిర్మాణంలో మార్పులు, పెరిగిన మెటీరియల్ ధరల కారణంగా రూ.7.78 కోట్లు అవసరం అవుతుందని మరో అంచనా సిద్ధం చేశారు. దీనిపై దివీస్ యాజమాన్యం స్పందించాల్సి ఉంది. మొదట్లో ఇరిగేషన్ విభాగం సకాలంలో స్పందించి ఉంటే సగం వంతెన పూర్తయ్యేదని పంచాయతీ వాసులు వాపోతున్నారు. అలాగే 2022లోనే తాటితూరు జెడ్పీ హైస్కూల్ నుంచి అవతలి వైపునకు రూ.2 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించతలపెట్టిన వంతెనకు కూడా మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శిలాఫలకం ఆవిష్కరించారు. అప్పట్లో కొందరు ప్రబుద్ధులు కాంట్రాక్టర్ ముందుకు రాకుండా అడ్డు తగలడంతో ఆ పనులు కూడా నిలిచిపోయాయి. ప్రస్తుతం దీని నిర్మాణ వ్యయం కూడా భారీగా పెరిగినట్టు అంచనా వేస్తున్నారు. కారణాలు ఏవైనా ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న వంతెనల నిర్మాణం జరగకపోవడంతో ఈ రెండు పంచాయతీల ప్రజలు నదికి వరదలు వచ్చిన ప్రతీసారి అవస్థలు పడుతున్నారు. ఇప్పటి ప్రభుత్వమైనా వాటిని పూర్తి చేస్తుందా అన్నది ప్రశ్నగానే మిగిలిపోతుందని భీమిలి మండల ప్రజలు అంటున్నారు.



తాటితూరు వద్ద గోస్తనీనదిపై భూమిపూజతోనే ఆగిపోయిన పనులు



తాటితూరు జెడ్పీ హైస్కూల్ నుంచి గోస్తనీ నది మీదుగా తాటితూరు కళ్లాలకు కాలిబాట

నేటి నుంచి హజరత్ ముఖ్తియార్ ఆలీ ట్రస్ట్ వార్షికోత్సవాలు



వేడుకల పోస్టర్ ఆవిష్కరిస్తున్న అహ్మద్, తదితరులు

మధురవాడ : హజరత్ ముఖ్తియార్ ఆలీ చారిటబుల్ ట్రస్ట్ 22వ వార్షికోత్సవాలు సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ ఎండీ అహ్మద్ చెప్పారు. ఆదివారం సాయంత్రం మధురవాడ వల్లీనగర్‌లో ఉత్సవాల పోస్టర్‌ను ఇతర ట్రస్ట్ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు. సోమవారం ఉదయం మధురవాడ నుంచి కొమ్మాది జంక్షన్, మారికవలస, పరదేశిపాలెం, బోయిపాలెం, భీమిలి క్రాస్ రోడ్స్ మీదుగా గారిపేట వరకు చందనం ఊరేగిస్తామని చెప్పారు. 25న సంస్థ ఆవరణలో పేదలు, భక్తులకు భోజనం పంపిణీ చేస్తామన్నారు. చదువు, ఆటలు, కళల్లో ప్రావీణ్యం చూపిన వారికి ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు భాషా, సుభహాని, సుధీర్, తాజ్, జలాల్ భాషా, సంతోష్ పాల్గొన్నారు.

పగలు వెలుగు.. రాత్రి చీకటి



పగటి వేళ వెలుగుతున్న విద్యుత్ దీపాలు

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు తొట్లకొండ నుంచి భీమిలి వరకు వేసిన విద్యుత్ దీపాలు పగలు వెలుగుతూ రాత్రి వేళ ఆగిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, రాత్రి సమయాల్లో దీపాలు వెలిగే విధంగా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

నగరంపాలెం రోడ్డులో ట్రాఫిక్ అవస్థలు

ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారులకు నరకయాతన



రోడ్డు మధ్యలో నిలిచిపోయిన వాహనాలతో నగరంపాలెం రోడ్డు



దుకాణాల వద్ద నిలిపిన వాహనాలు

మధురవాడ : జీవీఎంసీ మధురవాడ జోన్ కేంద్రం, మధురవాడ జంక్షన్ చుట్టుపక్కల రోడ్లలో ట్రాఫిక్‌తో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నిత్యం ఇదే పరిస్థితి ఉండడంతోపాటు ఆదివారం ఉదయం మరింత ఇబ్బందికరంగా తయారవుతోంది. మధురవాడ డైలీ మార్కెట్ – స్వతంత్రనగర్ రోడ్డు ఉన్న సగ భాగం అంతా ఇరువైపులా చిల్లర వ్యాపారుల గంపలు, బడ్డీలతో నిండిపోవడంతో ఇటు వైపు చూడడానికి కూడా ఎవ్వరూ ఇష్టపడడం లేదు. ఈ రోడ్డులోనే పీహెచ్‌సీ, విద్యా శాఖ ఆర్‌జేడీ కార్యాలయాలున్నా.. వారి అత్యవసర వాహనాలకు కూడా కనీస దారి దొరక్క నిత్యం యాతన పడుతున్నారు. నగరంపాలెం రోడ్డులో గత ప్రభుత్వం ఆక్రమణలు తొలగించి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. దీంతో ఈ రోడ్డులోకే దుకాణాలు, చేపలు, ఇతర వస్తువులు అమ్మేవారు, చిల్లర వ్యాపారులు వచ్చేశారు. వీటి ముందు రెండు వైపులా వాహనాలు రెండేసి వరుసల చొప్పున పార్కింగ్‌తో 80 అడుగుల రోడ్డులో కనీసం రాకపోకలకు 20 అడుగులు కూడా మిగలకుండా పోయింది. ట్రాఫిక్ సరిదిద్దడానికి ఇటువైపు ట్రాఫిక్ పోలీసులు కన్నెత్తి కూడా చూడకపోవడంతో నిత్యం అవస్థలు తప్పడం లేదని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. కనీసం ఉన్నతాధికారులైనా తక్షణమే స్పందించి ఇతర రోడ్లలో వలే శాశ్వత స్థాయిలో బడ్డీలు, దుకాణాలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అడుగడుగునా బురదతో అవస్థలు



బురదమయంగా లక్ష్మీపురం మార్గం



లక్ష్మీపురం త్రైత సిద్ధాంత భగవద్గీత మందిరం సమీపంలో రెండు రోడ్ల మధ్య గొయ్యి

తగరపువలస : భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీలో సరైన రోడ్లు లేక పంచాయతీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. శివారులోని త్రైత సిద్ధాంత భగవద్గీత మందిరం నుంచి లక్ష్మీపురం కళ్లాల వైపు మార్గంలో మట్టి రోడ్డు ఇటీవల వర్షాలకు బురదమయంగా మారిపోయింది. దీంతో చిన్న వాహనాలు సైతం ఈ మార్గంలో వెళ్లేకపోతున్నాయి. పద్మనాభం – మహరాజుపేట రోడ్డును ఆనుకుని త్రైత సిద్ధాంత భగవద్గీత మందిరం ముందు రెండు మార్గాలను కలుపుతూ ఉన్నచోట గోతులు వర్షం నీటితో నిండిపోయాయి.

దీంతో ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలతో వెళ్లడానికి సమస్యగా ఉంది. బురదలో కూరుకుపోవడం, గోతులలో వాహనాలు బోల్తాపడటం వంటివి రోజూ జరుగుతున్నాయి. గతంలో ఈ మార్గంలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా కొందరు స్వార్థపరులు వాటిని ఇతర చోట్లకు మళ్లించి ఈ మార్గాలను అసంపూర్తిగా వదిలేశారు. ఇప్పటికైనా అసంపూర్తిగా ఉన్న రోడ్ల నిర్మాణం చేపట్టాలని పంచాయతీ వాసులు కోరుతున్నారు.

కేంద్రం ఆంక్షలతోనే స్టీల్‌ప్లాంట్‌కు దుస్థితి

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం పగబట్టిందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు బి.మల్లయ్య, తౌడన్న ఆరోపించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. 1228వ రోజు దీక్షా శిబిరంలో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత గనులు లేకపోయినా సామర్థ్యానికి మించి ఉత్పత్తులు సాధించిన ఘన కీర్తి విశాఖ ఉక్కు సొంతమన్నారు. విశాఖ ఉక్కు సామర్థ్యాన్ని పెంచేందుకు డీపీఆర్ సిద్ధంగా ఉన్న పరిస్థితుల్లో కేంద్రం తన అనుయాయులకు కర్మాగారాన్ని అప్పగించాలనే కుట్రతో విష ప్రచారం మొదలు పెట్టి ప్రైవేటీకరణకు తెరలేపిందన్నారు. డి.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు, శ్రీనివాసనాయుడు, పుల్లారావు, విల్లా రామ్మోహన్ కుమార్, ఎల్.వి.రమణ పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు తదితరులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

శిథిల రోడ్డుతో ఇక్కట్లు



గోతులమయమై రాళ్లు తేలిన తునిపాలెం రోడ్డు

పద్మనాభం : మండలంలోని మద్ది పంచాయతీ తునిపాలెం రోడ్డు శిథిలమైపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి వాహనచోదకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలమండ ఆర్‌ఎస్ రోడ్డు నుంచి తునిపాలెం వరకు రెండు కిలో మీటర్లు నిడివి గల బీటీ రోడ్డు పూర్తిగా శిథిలమైంది. రోడ్డు గోతులు పడి రాళ్లు తేలిపోయాయి. మద్ది, బాందేవుపురం నుంచి ఈ రోడ్డు మీదుగా అనంతవరం గ్రామస్తులు కూడా రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు గోతులమయమై అధ్వానంగా తయారవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహన చోదుకులు కోరుతున్నారు.

ఎస్‌వోఎస్ సేవలు ప్రశంసనీయం



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న జయదేవి

భీమునిపట్నం : తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను చేరదీసి వారికి చక్కని భవిష్యత్ అందిస్తున్న ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్ సేవలు ఎంతో ప్రశంసనీయమని జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ పీడీ డి.జయదేవి అన్నారు. ఎస్‌వోఎస్ వ్యవస్థాపకులు హెర్మన్ మైనర్ జయంతి సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఇటువంటి ఎన్నో విలేజ్‌లు ఏర్పాటు చేసిన గొప్ప వ్యక్తి హెర్మన్ మైనర్ అన్నారు. ఆయన దయవల్ల వేలాది మంది పిల్లలకు మేలు జరుగుతోందన్నారు. అమ్మాయిలను చక్కగా చదివించి వివాహాలు కూడా జరిపించి పంపించడం చాలా సంతోషకరమన్నారు. ఇక్కడి పిల్లలకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన పిల్లలకు బహుమతులు అందించారు, అనంతరం జిల్లా ప్రొహిబిషన్ అధికారి ఎం.శరత్‌బాబు మాట్లాడుతూ ఎస్‌వోఎస్ అందిస్తున్న సేవలు ఆదర్శవంతమైనవన్నారు. ఈ సందర్భంగా పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విలేజ్ ఇన్‌చార్జి సి.మణికందన్, కుటుంబ బలోపేత కార్యక్రమ ఇన్‌చార్జి దుర్గరాజు, సభ్యులు ఆర్.కృష్ణవేణి, జాన్‌పీటర్, నాయక్, సంజయ్ పాల్గొన్నారు.

అందరూ బాధ్యతతో మొక్కలు నాటాలి



పక్షులకు ధాన్యం కుచ్చులతో ట్రస్టు సభ్యులు

భీమునిపట్నం : ప్రస్తుత వాతావరణంలోని మార్పులను తట్టుకోవడానికి అందరూ బాధ్యతతో ఎక్కువ మొక్కలు పెంచాలని ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ కన్వీనర్ ఆనంద్‌కుమార్ పింగళి అన్నారు. ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం జమ్మి చెరువు పార్కుతోపాటు సచివాలయాల వద్ద మొక్కలు నాటారు. పక్షుల ఆహారం కోసం ధాన్యం కుచ్చులు ఏర్పాటు చేశారు. ట్రస్ట్ చైర్మన్ ఉమర్ అలీషా సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ట్రస్ట్ సభ్యులు పి.మంజుల, పీవీ రామరెడ్డి, ఎస్.రమాదేవి, కడిమిశెట్టి లక్ష్మి, శేషారత్నం, రవి, శ్యాం, ఉషాశ్రీ, రమాదేవి పాల్గొన్నారు.

తీరం.. జనసంద్రం



రుషికొండ బీచ్‌లో పర్యాటకులు

కొమ్మాది: పర్యాటక ప్రాంతాలన్నీ ఆదివారం జనంతో కళకళలాడాయి. సాయంత్రం నుంచి వందలాది మంది పర్యాటకులు సాగర్‌నగర్, రుషికొండ, తొట్లకొండ, భీమిలి బీచ్‌లో స్నానాలు చేస్తూ ఉపశమనం పొందారు. తిమ్మాపురంలో గల రామానాయుడు ఫిల్మ్ స్టూడియో, బావికొండ, మంగమారిపేట తొట్లకొండపైకి పర్యాటకుల రాకపోకలు పెరిగాయి.

రద్దు చేసిన రైళ్లు పునరుద్ధరించాలని వినతి

తగరపువలస : దక్షిణ మధ్య రైల్వేకు చెందిన విజయవాడ డివిజన్‌లో అభివృద్ధి పనుల పేరుతో ఈ నెల 24 నుంచి ఆగస్టు 10 వరకు ఎనిమిది జతల రైళ్లను రద్దు చేస్తున్నట్టు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని నగరానికి చెందిన సామాజిక కార్యకర్త గొనప అప్పన్న కోరారు. ఈ మేరకు విజయవాడ డివిజన్ అధికారులకు లేఖ రాశారు. అభివృద్ధి పనులు, భద్రతాపరమైన తనిఖీలు అంటూ ఏడాది కాలంగా సామాన్యులు తిరిగే ప్రసిద్ధ రైళ్లను రద్దు చేస్తున్నారన్నారు. ఆదాయమే ప్రధానంగా రైల్వేశాఖ వందే భారత్ రైళ్లను నడపడంపై చూపే శ్రద్ధను వేలాది మంది ప్రయాణించే సాధారణ, ఎక్స్‌ప్రెస్ రైళ్లపై చూపితే బాగుంటుందన్నారు. రత్నాచల్, సింహాద్రి, జన్మభూమి, ఉదయ్, రాజమండ్రి ప్యాసింజర్, మచిలీపట్నం, గుంటూరు – రాయగడ తదితర రైళ్లను తరచూ రద్దు చేస్తున్నారన్నారు. రైల్వేలో ఆధునిక సంస్కరణల పేరుతో అధిక ఆదాయం వచ్చే వందే భారత్ రైళ్ల సంఖ్య పెంచి సాధారణ ప్రయాణికుల రైళ్లను క్రమంగా తగ్గించేలా వ్యూహం అమలు చేస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి సాధారణ ప్రయాణికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పూర్తి స్థాయిలో రైళ్లు నడపాలని కోరారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేం



పెద్దిపాలెంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



భీమిలిలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తగరపువలస : భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆనందపురం మండలం పెద్దిపాలెంలో బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బలిదాన్ దివాస్ పేరుతో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ జాతీయవాదానికి, జాతీయ సమైఖ్యతకు మారు పేరు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పి.వి.వి.ప్రసాదరావు, మీసాల రామునాయుడు, పోతిన జీవన సంతోష్, బోర శ్రీను, పి.చిన్నారావు, మల్లవరపు కృష్ణ, ఊడికల రాజు, నిమ్మకాయల అప్పలరాజు, ఉప్పాడ శివ, మల్లవరపు మోహన్ పాల్గొన్నారు.

భీమునిపట్నం: బీజేపీ స్థానిక కార్యాలయం వద్ద నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయవాదాన్ని విశ్వసించి భారతీయ జనసంఘ్‌ను స్థాపించి ఎన్నో గొప్ప కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. ఆయన సేవలను అందరూ గుర్తించుకోవాలని కోరారు. 3వ వార్డు పార్టీ అధ్యక్షురాలు కంటుభుక్త సునీత, నాయకులు ముమ్మిడిశెట్టి సునీల్, బడే విజయ్, చెన్నా రాము, నల్లి సత్యం, నిమ్మయాల త్రినాథ్ పాల్గొన్నారు.

మధురవాడ : జీవీఎంసీ 5, 7 వార్డుల్లో బీజేపీ నాయకులు బలిదాన్ దివస్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ముఖర్జీ చేసిన త్యాగాలు, ఆయన సిద్ధాంతాలు బీజేపీ కార్యకర్తలతోపాటు నాయకులు కూడా ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మైనార్టీ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు తాతపూడి ప్రదీప్ కుమార్, తులసి రామిరెడ్డి, ఎస్.లక్ష్మణ్, రమణారెడ్డి, బి.రమణ పాల్గొన్నారు.



జీవీఎంసీ 7వ వార్డులో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు